# కేసీఆర్‌తోనే బుక్కెడు బువ్వ

## ఆయన పక్కకు జరగంగనే అన్నీ బంద్ అయినయ్ • పొలం మొత్తం ఎండిపోయింది.. అప్పే మిగిలింది

- కొడుకు పోయిండు.. వాడి పిల్లలను ఎట్ల సాదాలె?
- గోడు చెప్పుకుంటూ బోరున విలపించిన మల్లయ్య
- అండగా ఉంటామన్న కేటీఆర్.. లక్ష చెక్కు అందజేత
- ముషంపల్లిలో బాధితుడికి మాజీ మంత్రి పరామర్శ

నల్లగొండ, ఏప్రిల్ 1: 'మా అయ్య కేసీఆర్ ఉన్నన్ని రోజులు మాకు ఏ రంది లేదు. ఆయన ఉన్నప్పుడు ఒక్క ఎకరం కూడా ఎండిపోలేదు. బుక్కెడు బువ్వ దొరికింది. మా అయ్య పక్కకు జరగంగనే మొత్తం పోయింది. ఈ సారి పంట మొత్తం ఎండిపోయింది. అప్పు అయ్యింది. మా అయ్య ఉన్నప్పుడు నాకు రైతుబంధు ఇచ్చిండు. ఆ పైసలతో పిండి బస్తాలు కొనేటోన్ని. వానకాలంలో రైతుబంధు ఇస్తే తోటలో పాదులకు కర్సు పెట్టిన. అప్పుడు అప్పే లేదు. ఖుషీగా ఉండే. ఇప్పుడు ఎండిపోయిన పొలం చూసి మందు తాగాలని చూసిన. ఒక్కగానొక్క కొడుకు చచ్చిపోయిండు. వాడికి చిన్న చిన్న కూనలున్నరు. వాళ్లను ఎట్లా సాదాలనేదే నా బాధ' అంటూ నల్లగొండ జిల్లా ముషంపల్లికి చెందిన గన్నెబోయిన మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో తన గోడు చెప్పుకుంటూ బోరున విలపించాడు. ఐదెకరాల పొలం ఎండిపోయిందన్న బాధతో 20 రోజుల కిందట మల్లయ్య ఆత్మహత్యకు ప్రయత్నించగా.. మీడియా ప్రతినిధులు ఆపి ఆయన చెప్పిన కష్టాలను వీడియో తీశారు. ఆ వీడియోలో.. 'ఈ సారి కేసీఆర్ సారు లేక బత్తాయి తోటతో పాటు పొలమంతా ఎండిపోయింది. ఎండిన పొలం మేకల పాలైంది. బువ్వకాడికి పోతే సంతోషం లేదు. చేను కాడికి వస్తే కుషాల్ లేదు. చేసిన అప్పు తీరేదెట్ల? కొడుకు సచ్చిపోయిండు. వాడి చిన్నచిన్న కూనలను సాదేదెట్ల? కడుపు కుద్దుకుంటున్న. పురుగుల మందు తాగాలనిపిస్తుంది. లేదంట కంపల్ల పడి సచ్చిపోవాలనిపిస్తుంది. ఉన్న పొలం ఎండిపోతే ఏం తినాలె? అప్పులేం కట్టాలె? ఈ కారు రైతుబంధు ఇప్పటిదాకా రాలె. కేసీఆర్ వానకాలం ఇస్తే దాన్ని దున్నినోడికి, అంతకుముందు ఇస్తే తోటల గుంటలు తీసినోడికి ఇచ్చిన. ఈసారి రైతుబంధు రాకపోవటంతో అప్పుల పాలైన. మల్లా నువ్వే రావాలి కేసీఆర్ సారు. నా ఓటు నీకే. నీవల్లనే నాకు ఇన్నేండ్లు బుక్కెడు బువ్వ దొరికింది' అంటూ ఆవేదన చెందాడు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యి కేటీఆర్ దృష్టికి వచ్చింది. దీంతో త్వరలోనే ముషంపల్లికి వచ్చి మల్లయ్యను కలుస్తానని ట్వీట్ చేశారు. అన్నట్టుగానే సోమవారం మల్లయ్య ఇంటికి వచ్చి పరామర్శించారు. వీడియోను కేసీఆర్ కూడా చూశారని, బాధతో తనను ఇక్కడికి పంపించారని కేటీఆర్ వెల్లడించారు. వీడియోలో అలా ఎందుకు మాట్లాడావని, ఆ ఆలోచన ఎందుకు వచ్చిందని ఆరా తీశారు. తనకున్న తొమ్మిదెకరాల భూమిలో 4 ఎకరాల్లో తోట, ఐదెకరాల్లో పొలం పెట్టానని మల్లయ్య చెప్పాడు. పొలం మొత్తం ఎండిపోయి, పెట్టిన పెట్టుబడి అంతా నష్టపోయానని వివరించాడు. దీంతో 'నీకేం భయంలేదు. ఇంకా ఏం కావాలన్నా భూపాల్‌రెడ్డికి చెప్తే నేను వస్తా. నీకు ధైర్యం చెప్పి రమ్మని మమ్మల్ని కేసీఆర్ ఇక్కడికి పంపిండు. నీకు బీఆర్ఎస్ అండగా ఉంటది. ఇక్కడ భూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జగదీశ్‌రెడ్డి అండగా ఉంటరు' అని కేటీఆర్ భరోసా కల్పిస్తూ రూ.లక్ష చెక్కు అందజేశారు. బరువెక్కిన గుండెతో కేటీఆర్‌కు మల్లయ్య దండం పెట్టాడు. అక్కడే తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నట్టు మహిళలు చెప్పటంతో కాసేపు వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.



ముషంపల్లిలో రైతు మల్లయ్యకు రూ.లక్ష చెక్కు అందిస్తున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, కిశోర్, రవీంద్రకుమార్

### కేటీఆర్ ఇచ్చిన లక్షతో అప్పు తీరుస్త

> నేను పంట ఎండిపోయిందని బాధ పడితే విలేకర్లు వచ్చి తీసిన వీడియో చూసిన తర్వాత కేటీఆర్ వస్తాడంటే నేను మొదట్లో నమ్మలేదు. కానీ ఇయ్యాల ఆయనే సక్కగ నా ఇంటికి వచ్చి నా మీద చెయ్యి వేసి ధైర్యం చెప్పిండు. లక్ష రూపాయల చెక్కు ఇచ్చిండు. ఇంకా ఏమైనా బాధ ఉంటే చెప్పు అండగా ఉంటామన్నాడు. నాకు సంతోషం కల్గింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ నీళ్ల కష్టాలు లేవని చెప్పిన. ఈ సారి అప్పు తెచ్చి పెట్టుబడి పెడితే రైతుబంధు రాక అప్పు అట్లే ఉన్నది. ఈ డబ్బుతో అప్పు తీర్చాలి అనుకుంటున్న. తండ్రి లెక్కనే కొడుకు కూడా జనం బాధలు పట్టించుకుంటుండు అంటే గొప్పే గదా.
>
> -గన్నెబోయిన మల్లయ్య, రైతు, ముషంపల్లి

### సీఎం, మంత్రుల స్పందనేది?: కేటీఆర్

'రాష్ట్రంలో కరువుతో రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ కరువు కాలం తెచ్చింది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు' అని కేటీఆర్ అన్నారు. మల్లయ్య, బోర్ల రాంరెడ్డిని కలిసిన అనంతరం మాట్లాడుతూ.. బోర్ల రాంరెడ్డి కేసీఆర్ హయాంలో పదేండ్లలో ఒక్క బోరు వేయలేదని, మళ్లీ ఇటీవలే ఆరు బోర్లు వేశారని తెలిపారు. ప్రభుత్వ అసమర్థతతోనే ఈ కరువు వచ్చిందని ఆరోపించారు. ఒకవైపు కాళేశ్వరం ప్రాజెక్టును విఫల ప్రాజెక్టుగా చూపించాలని, రిజర్వాయర్లలో నీళ్లు నింపకుండా ఈ ప్రభుత్వం నాటకాలు ఆడిందని విమర్శించారు. ఇటీవల కేసీఆర్ పర్యటన భయంతో నంది పంప్‌హౌజ్‌లో ఎల్లంపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోసి కరీంనగర్‌కి నీళ్లు వదిలారని తెలిపారు. నిన్నటి దాకా కాళేశ్వరం ఫెయిల్ అయ్యిందని, ఇయ్యాల అదే బాహుబలి మోటర్లతో కరీంనగర్‌కు నీళ్లు అందిస్తున్నరని వెల్లడించారు. ఇదేదో ఎండాకాలం వచ్చేముందు చేసుంటే ఈ కరువు ఉండేది కాదు కదా అని అన్నారు. మంత్రులకు ధైర్యం ఉంటే కరెంటు కోతలు, సాగునీటి కొరత లేదని ఇదే మషంపల్లికి వచ్చి రైతులతో చెప్పాలని సవాల్ విసిరారు.




ముషంపల్లిలో బోర్ల రాంరెడ్డి బోరును పరిశీలించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

### బోర్ల రాంరెడ్డికి భరోసా

**వందకుపైగా** బోర్లు వేసి బోర్ల రాంరెడ్డిగా పేరు తెచ్చుకున్న రైతు బైరెడ్డి రాంరెడ్డిని కేటీఆర్ కలిసి ధైర్యం చెప్పారు. పంటల పరిస్థితి ఎలా ఉన్నది? ఎన్ని ఎకరాలు ఎండిపోయాయి? అని అడిగి బోర్లు పరిశీలించారు. ఈ కరువుతో నాలుగైదు లక్షల వరకు ఖర్చు చేశానని, అయినా పంటలు ఎండిపోయాయని రాంరెడ్డి తెలిపారు. రాంరెడ్డి కూడా ముషంపల్లి వాసే కావటంతో ఆయన ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడారు. గ్రామ కరువు పరిస్థితిని ఆరా తీశారు. ఎవరూ అధైర్యపడొద్దని, రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కేటీఆర్ వెంట సూర్యాపేట శాసనసభ్యుడు జగదీశ్‌రెడ్డి, నల్లగొండ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్ ఉన్నారు.

## లోకం పోకడ




## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 42.3°c | 22.0°c |
| మెదక్ | 41.9°c | 20.5°c |
| నిజామాబాద్ | 41.2°c | 25.6°c |
| రంగారెడ్డి | 41.1°c | 18.3°c |
| వరంగల్ | 41.0°c | 27.0°c |
| నల్లగొండ | 40.0°c | 24.0°c |
| ఖమ్మం | 40.0°c | 25.0°c |
| కరీంనగర్ | 40.0°c | 28.0°c |
| హైదరాబాద్ | 39.6°c | 25.2°c |
| మహబూబ్‌నగర్ | 39.1°c | 25.7°c |

## సుర్రుమంటున్న సూరీడు

15 జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజులు ఉష్ణోగ్రతలు మరింత తీవ్రంగా ఉంటాయని, ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాలకు వడగాల్పుల ముప్పు అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణశాఖ సూచించింది. ఆయా జిల్లాలకు అధికారులు సోమవారం ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు సైతం వడగాలుల హెచ్చరికలు చేశారు. సోమవారం నుంచి కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల మేర పెరుగుతాయని, రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల్లో 40.8 డిగ్రీల నుంచి 42.3 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉంటాయని పేర్కొన్నారు.

# వరికి 500 బోనస్ ఎప్పుడిస్తరు?

## వానకాలం పోయి యాసంగి వచ్చినా.. ఎన్నికల హామీపై ప్రకటన చేయని కాంగ్రెస్

- సర్కార్ హ్యాండిచ్చిందంటున్న రైతులు
- ఈ సీజన్‌లో రూ.3750 కోట్ల నష్టం
- బోనస్‌పై బీఆర్ఎస్ పోరుబాట
- నేడు కలెక్టర్లకు వినతిపత్రాలు.. 6వ తేదీన నిరసన దీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ హామీ అమలుకు నోచుకోవడం లేదు. ఓ వైపు యాసంగి ధాన్యం కొనుగోళ్లు మొదలైనా బోనస్‌పై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయడం లేదు. ఇప్పటికే సాగు నీళ్ల కరువై పంటలు ఎండిపోతుంటే.. కనీసం బోనస్‌తోనైనా ఊరట లభిస్తుందనుకున్న రైతులకు నిరాశే మిగులుతున్నది. అధికారంలోకి రాగానే ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామంటూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన కాంగ్రెస్ పార్టీ తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీపై నోరుమెదపడం లేదు. దీంతో రైతులు రూ. 500 బోనస్ ఎప్పుడిస్తారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

### వానకాలం తప్పించుకొని.. యాసంగికీ 'హ్యాండ్'

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత డిసెంబర్‌లో కొలువుదీరే సమయానికి వానకాలం ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామన్న హామీని అమలు చేయాలని కోరగా.. 'ఇప్పుడే కదా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది.. యాసంగి సీజన్‌కు బోనస్ ఇస్తాం' అంటూ ప్రభుత్వ పెద్దలు పేర్కొన్నారు. ఇప్పుడు యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కానీ ఈ సీజన్‌లో కూడా ప్రభుత్వం 'హ్యాండ్' ఇస్తుందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏప్రిల్ ఒకటోతేదీ నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని ఇటు పౌరసరఫరాల సంస్థ, అటు ప్రభుత్వం ప్రకటించాయి తప్ప బోనస్‌పై మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో వానకాలం మాదిరిగానే యాసంగి ధాన్యానికి కూడా ప్రభుత్వం బోనస్ ఇవ్వకుండా మొండిచెయ్యి చూపుతుందన్న విమర్శలు వస్తున్నాయి.

### బోనస్‌పై సీఎం స్పందించరేం?

> ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చే విషయమై ఇప్పటివరకు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఇతర నేతలెవరూ కనీసం స్పందించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులంటే, రైతులకు ఇచ్చిన హామీ అంటే అంత చులకనా అని ప్రశ్నిస్తున్నారు.

### రైతులకు రూ. 3750 కోట్ల నష్టం

కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం క్వింటాలు ధాన్యంపై రూ.500 బోనస్ ఇస్తే రైతులకు ఎంతో కొంత ఊరట లభించేది. కానీ ప్రభుత్వ తీరు చూస్తుంటే ఈ సీజన్‌లో బోనస్ అమలు కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ ఒక్క సీజన్‌లోనే రైతులు రూ.3750 కోట్లు నష్టపోనున్నట్టు అంచనా వేస్తున్నారు. ఈ యాసంగిలో పౌరసరఫరాల సంస్థ 75.4 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ లెక్కన క్వింటాలుకు బోనస్ రూ. 500 ఇస్తే మొత్తం 75.4 లక్షల టన్నులకు రైతులకు ప్రభుత్వం రూ. 3,750 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తం రైతులు నష్టపోయినట్టేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం.. ఇచ్చినహామీ మేరకు క్వింటాలు ధాన్యాన్ని రూ.3100కు కొనుగోలు చేస్తున్నది.

### బోనస్ కోసం బీఆర్ఎస్ పోరుబాట

**ధాన్యానికి** రూ.500 బోనస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ విమర్శించింది. రైతుల పక్షాన ప్రభుత్వంపై యుద్ధం చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. రైతులకు ఈ యాసంగి సీజన్ నుంచే రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోరుబాట పట్టింది. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కార్యాచరణ ప్రకటించారు. ఇందులో భాగంగా మంగళవారం అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ నేతలు ఆయా జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నారు. హైదరాబాద్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు ప్రభుత్వానికి వినతి పత్రం ఇవ్వనున్నారు. అప్పటికీ బోనస్‌పై ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే.. ఈ నెల 6న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నిరసన దీక్షలు చేపట్టాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. అప్పుడు కూడా ప్రభుత్వం నుంచి స్పందనలేకపోతే కొనుగోలు కేంద్రాల్లోనే నిరసనలు చేపట్టాలని నిర్ణయించారు.



నల్లగొండలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ లింగయ్యయాదవ్, పార్టీ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, రవీంద్రకుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్, నల్లమోతు భాస్కర్‌రావు, పార్టీ నాయకులు

# కండ్ల ముందు 100 రోజుల అబద్ధం

## హామీలు అమలు చేయలేక పనికిమాలిన మాటలు • రైతుబంధు పత్తలేదు.. రైతు రుణమాఫీ ఊసు లేదు

## కాంగ్రెస్ సర్కారు పాలనలో రైతాంగం అస్తవ్యస్తం • మళ్లీ కేసీఆరే రావాలని ప్రజలు కోరుకుంటున్నరు: కేటీఆర్

- కాంగ్రెస్ మోసాన్ని ఎండగడుదాం
- నల్లగొండ పార్టీ సమావేశంలో కేటీఆర్
- ఇక ఆట మొదలైంది: జగదీశ్‌రెడ్డి



నల్లగొండలో బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

సూర్యాపేట, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): అనేక మాయమాటలు, అలవికాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల ముందు చెప్పినవన్నీ అబద్ధాలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. నల్లగొండలో సోమవారం బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. 'పదేండ్ల నిజం ముందు వంద రోజుల అబద్ధం కనిపిస్తున్నది. 420 హామీలు అమలు చేయలేక కాంగ్రెస్ నేతలు పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఐదు నెలలు గడుస్తున్నా ఆ ఊసే లేదు. రుణాలు తీసుకున్న రైతుల ఆస్తులను జప్తు చేస్తామని బ్యాంకులు నోటీసులు పంపిస్తుంటే సర్కారు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నది. మనం కడుపులో చల్ల కదలడకుండా రైతుబంధు పది రోజుల్లో ఇచ్చినం. నేడు రైతుబంధు రాక చాలా గ్రామాల్లో రైతులు కుత కుత ఉడుకుతున్నరు. పైగా, ఇక్కడి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టండి అంటడు. మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు దుబారా అని, కేసీఆర్ డబ్బు వేస్ట్ చేసిండని అంటుండు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు డబ్బాలో పడకముందే ఇంత అహకారంగా మాట్లాడుతున్నరు. రేపు ఓటు వేస్తే ఏమంటారో! రైతు బంధు, రుణమాఫీ, నీళ్లు, కరెంట్ ఇవ్వకున్నా, నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించినా రైతులు, ప్రజలు మాకే ఓట్లేసిర్రు అని అంటరు. ఈ విషయాలను బీఆర్ఎస్ శ్రేణులు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది' అని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా ఇప్పటి నుంచే కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు వివరిస్తే ఎంపీ సీట్లు గులాబీ పార్టీవేనని వెల్లడించారు. 'డిసెంబర్ 9న రుణమాఫీ పొందిన వారంతా కాంగ్రెస్‌కు ఓటేయండి. మోసపోయినవాళ్లు బీఆర్ఎస్‌కు ఓటేయండి' అని రైతులకు చెప్పాలని సూచించారు.

### చెరిపేస్తే చెరగని సత్యం కేసీఆర్: కేటీఆర్

> తెలంగాణలో చెరిపేస్తే చెరగని సత్యం కేసీఆర్ అని కేటీఆర్ అన్నారు. సోమవారం ఎక్స్ వేదికగా తలసరి ఆదాయ వివరాలపై ఆయన స్పందించారు. '2022-23లో రూ.3.09 లక్షల తలసరి ఆదాయంతో పెద్ద రాష్ట్రాల్లో దేశంలోనే తెలంగాణ నం.1గా ఉన్నది. అయినా ఏం చేసినవ్ కేసీఆర్? అని మీడియా, ప్రతిపక్షాలు అంటాయి. కానీ, చెరిపేస్తే చెరగని సత్యం కేసీఆర్ సాధించిన ఆర్థిక ప్రగతి' అని పేర్కొన్నారు.

### నల్లగొండ, ఖమ్మంలోనే మానవ బాంబులు

'రేవంత్ ప్రభుత్వం ఐదేండ్లు ఉండాలి. ఇచ్చిన 420 హామీలు అమలు చేయాల్సిందే. లేదంటే మనమే మెడలు వంచి అమలు చేయించాల్సిన బాధ్యత తీసుకుందాం. రేవంత్ ప్రభుత్వాన్ని కూల్చాలన్న ఆలోచన, కుట్రలు చేయాల్సిన అవసరం మా పార్టీకి లేదు. ఆయన ప్రభుత్వాన్ని కూల్చే మానవ బాంబులు నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోనే ఉన్నారు. సీఎం అయ్యాక కూడా రేవంత్‌రెడ్డి చేష్టల్లో మార్పు కనిపిస్తలేదు. లోక్‌సభ ఎన్నికల తర్వాత షెల్టర్ కోసం కాంగ్రెస్ నుంచి బీజేపీకి వెళ్లే మొట్టమొదటి వ్యక్తి రేవంత్‌రెడ్డే అయితడు. ఇది జరిగి తీరుతది. గుర్తు పెట్టుకోండి' అని కేటీఆర్ తెలిపారు.

### ఇక రేవంత్ సర్కారుకు ముచ్చెమటలే: జగదీశ్‌రెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయ్యిందని, ఇక ఆ సర్కారును ఆటాడించే పనిని కేసీఆర్ మొదలు పెట్టారని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమం పట్టని రేవంత్ సర్కార్ రోజుకో సమస్యను తెచ్చి ప్రజల్లో బీఆర్ఎస్‌ను చులకన చేయాలని ప్రయత్నిస్తున్నా కొంత సమయం ఆగాలని సంయమనంతో ఉన్నామని, కేసీఆర్ బయటకు వచ్చారు తస్మాత్ జాగ్రత్త అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'మనం ఏం చేయాలో కేసీఆర్ నిన్న మనకో డైరెక్షన్ ఇచ్చారు. కేసీఆర్ చెప్పిన మాటలను గ్రామాల్లో అమలు చేయాల్సిన అవసరం ఉన్నది. ఆ మాటలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలి' అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చొనే వ్యక్తికి బాధ్యత ఉంటుందని కేసీఆర్ హుందాతనాన్ని చూపి 110 రోజులు ఆగాలని మాకు చెప్పిర్రు. కానీ, ఇదే కాంగ్రెస్ రాజస్థాన్‌లో అధికారం కోల్పోయిన 10 రోజులకే బీజేపీ సర్కారు కరెంటు ఇస్తలేదని సెక్రటేరియట్‌పై దాడి చేసింది. వంద రోజులిచ్చినా విషం కక్కారు తప్ప హామీలపై చర్చించలేదు' అని వెల్లడించారు. నాయకులను తయారు చేసే కర్మాగారం బీఆర్ఎస్ ఫ్యాక్టరీ అని, ఇవాళ వేదికపై ఉన్న మిత్రులందరినీ కేసీఆరే తయారుచేశారని తెలిపారు. సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, నలమోతు భాస్కర్‌రావు, నోముల భగత్, బొల్లం మల్లయ్య యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కేసీఆరే మళ్లీ రావాలంటున్నరు..

**కేసీఆర్** ఇచ్చిన దానికంటే మించి ఏదో ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ మాయమాటలకు జనం మోసపోయారని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఎండిన పొలాలను పరిశీలించేందుకు సూర్యాపేట జిల్లాకు వస్తే రైతన్నలు.. 'సారూ మీరే కావాలి. మళ్లీ మీరే రావాలి' అని దీనంగా వేడుకుంటున్నరు. దీన్నిబట్టే కాంగ్రెస్ సర్కారు అబద్ధాలు, చేస్తున్న మోసాలు ప్రజలకు అర్థమవుతున్నాయని తెలుస్తున్నది. ఏ ఊరికి పోయినా ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉండడని మేము అనుకోలేదని ప్రజలే అంటున్నరు. కేసీఆర్ సూర్యాపేట, తుంగతుర్తికి వస్తే జనంలో ఎమోషన్ కనిపించింది. ఆ వీడియోలు చూస్తుంటే నల్లగొండ జిల్లాలో మనం ఎట్లా ఓడిపోయామో అర్థం కాలేదు. జరిగింది కలా? నిజమా? అని గుండె కలుక్కుమన్నది. మొన్న ఒక వీడియో వచ్చింది. ముషంపల్లికి చెందిన మల్లయ్య అనే రైతు కేసీఆర్ సార్ మళ్లీ రావాలి.. కేసీఆర్ ఉన్నప్పుడే మేము బాగున్నాం అని అన్నడు' అని వెల్లడించారు. 'రేవంత్ సర్కార్‌లో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ వేయలేదు. ఒక్క కాంపిటేటివ్ పరీక్ష పెట్టలేదు. కానీ నేడు సీఎం రేవంత్‌రెడ్డి గొప్పగా హైదరాబాద్‌లో సభలు పెట్టి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి తాము 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని పచ్చి అబద్ధాలు చెప్తుండు. బీఆర్ఎస్ హయాంలో పూర్తయిన ప్రక్రియకు నేడు తామే ఉద్యోగాలు పుట్టించి ఇచ్చినట్టు తప్పుడు ప్రచారాలు చేసుకుంటున్నరు. మనం ఇచ్చి చెప్పుకోలేకపోయాం' అని పేర్కొన్నారు.

# ఉరకలెత్తుతున్న ఉద్యమస్ఫూర్తి

## ప్రజలను తట్టిలేపుతున్న సన్నాహక సమావేశాలు.. గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం

## కాంగ్రెస్, బీజేపీకి గుణపాఠం తప్పదన్న నేతలు

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధంచేసేందుకు బీఆర్ఎస్ నిర్వహిస్తున్న సన్నాహక సమావేశాలు గులాబీ సేనల్లో ఉద్యమస్ఫూర్తిని రగిలిస్తున్నాయి. బీఆర్ఎస్ ఉనికిని దెబ్బతీసేందుకు కుట్రపన్నుతున్న కాంగ్రెస్, బీజేపీకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్తామని పార్టీ శ్రేణులు ప్రతినబూనుతున్నాయి. మరోవైపు పార్టీ అధినేత కేసీఆర్ ఆదివారం మూడు జిల్లాల్లో రైతన్నలకు భరోసాగా చేపట్టిన పొలంబాట పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నది. ఉద్యమకాలంలో కేసీఆర్ అనుసరించిన వ్యూహంతో తెలంగాణ సమాజం ఏ తీరుగా మమేకం అయిందో అదే రీతిలో ప్రస్తుతం పరిణామాలు నెలకొన్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నాయి.

### ద్రోహులకు బుద్ధిచెప్పుడే

ఉద్యమకాలంలో పార్టీని చీల్చేందుకు నాడు కాం గ్రెస్ అనుసరించిన వ్యూహాన్ని బద్దలు కొడుతూ తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన చరిత్ర తమదని ఇప్పుడు అదే చరిత్ర పునరావృతం అవుతుందని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్పష్టంచేస్తున్నారు. ఉద్యమాన్ని అణిచివేసేందుకు నాడు హస్తం చేసిన కుట్రలను తెలంగాణ సమాజం మరచిపోలేదని ఇప్పు డు అవే కుట్రలను బీజేపీ, కాంగ్రెస్ కలిసి చేస్తున్నాయని వీటిని తిప్పికొడతామని సన్నాహక సమావేశాల్లో పార్టీ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి. తమది దశాబ్దాల చరిత్ర అని గొప్పలు చెప్పుకుంటున్న ఆ పార్టీలకు అభ్యర్థులు గతిలేక బీఆర్ఎస్ ఐదుగురు సిట్టింగ్ ఎంపీలను, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్‌పర్సన్లను తమ పార్టీలో చేర్చుకొని అభ్యర్థులుగా ప్రకటించుకోవటమే అందుకు నిదర్శమని ఉదహరిస్తున్నాయి. తమ స్వార్థ రాజకీయాల కోసం తల్లిలాంటి బీఆర్ఎస్ వీడిన ద్రోహులకు ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని భావిస్తున్నాయి. తాము స్వచ్ఛందంగా వారి భరతం పట్టేందుకు అవసరమైన కార్యాచరణను అమలుచేస్తామని బీఆర్ఎస్ నాయకులు పార్టీ అధిష్ఠానానికి నివేదిస్తున్నారు.

### పోయినోళ్లు ఒంటరే

ప్రలోభాలకు, భయాలకు, స్వార్థ ప్రయోజనాలకు పార్టీని వీడిన నేతలు అందుకు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని గులాబీ శ్రేణులు కరాఖండిగా తేల్చిచెప్తున్నాయి. ఐదుగురు సిట్టింగ్ ఎంపీలు, ఒకరిద్దరు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వీడి బీజేపీ, కాంగ్రెస్‌లో చేరినా, వారంతా ఒంటరి వారేనని పే ర్కొంటున్నాయి. వారితో మండల, నియోజకవర్గస్థా యి నాయకులెవరూ పార్టీని వీడలేదని, అదే తమకు ఉన్న నైతిక, భౌతిక బలమని పార్టీ నాయకులు చెప్తున్నారు. ఇద్దరు ముగ్గురు నేతలు స్వార్థం కోసం పార్టీని వీడినంత మాత్రాన నాయకులు, కార్యకర్తలు తమ పేగుబంధాన్ని పార్టీ నుంచి తెంపుకోలేరని, అందుకు ఇటీవల వెళ్లిన నాయకులతో క్షేత్రస్థాయి కార్యకర్తలు చేరకపోవడమే తమకు ఆస్తి అని పార్టీ అగ్రనాయకత్వం ఉ దహరిస్తున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో నే తాము పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించి తీరుతామనే ధీమాను పార్టీ వ్యక్తం చేస్తున్నది.

# అంతర్గత విద్యుత్తు సమస్యలకు బాధ్యుల్ని చేయొద్దు

## మా తప్పిదాలు లేకపోయినా నెపం మాపై మోపవద్దు: టీఎస్‌పీఈ జాక్

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): అంతర్గత విద్యుత్తు సమస్యలకు తమను బాధ్యులను చేయొద్దని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ (టీఎస్‌పీఈ జాక్) కోరింది. తమ తప్పిదాలు లేకున్నా విద్యుత్తు సంస్థల యాజమాన్యాలు, అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది లోపం అంటూ అసత్య ప్రచారం చేయడంపై జేఏసీ నేతలు మండిపడ్డారు.. సోమవారం హైదరాబాద్ మింట్‌కంపౌండ్‌లోని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ - 1104 కార్యాలయంలో జేఏసీ నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని క్యాటగిరీల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు అహర్నిశలు కృషిచేస్తామని తెలిపారు. రాష్ట్రంలో నిరుడు 15,497 ఉన్న గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ ఉన్నదని, ఈ ఏడాది ఇప్పటికే 15,623 మెగావాట్లకు చేరిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిరంతర విద్యుత్తును అందించేందుకు అవిశ్రాంతంగా పనిచేస్తామని చెప్పారు. సమావేశంలో జేఏసీ చైర్మన్ జీ సాయిబాబు, కన్వీనర్ పీ రత్నాకర్‌రావు, కో-కన్వీనర్ పీ బీసీరెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.